సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 9 । అక్టోబర్ । 2024



సోమశిలలో 53.13 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో మంగళవారం 53.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 10,700 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. పెన్నార్ డెల్టాకు 2 వేలు, ఉత్తర దక్షిణ కాలువలకు 9,040 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.77,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,085
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,298
సవర (8 గ్రాములు)	రూ.58,384

గరిష్టం/కనిష్టం
34.1 /27.6

వాతావరణం
జిల్లాలో బుధవారం వాతావరణం తేమగా ఉండే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 66 శాతంగా మంగళవారం నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి సబ్సిడీపై టమోటాలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లా రైతుబజార్లలో బుధవారం నుంచి కిలో రూ.50 చొప్పున సబ్సిడీపై టమోటాల విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనితాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా నెల్లూరులోని పత్తేఖాన్‌పేట, నవాబుపేట రైతుబజార్లతో పాటు, కావలి, కందుకూరు, పొదలకూరు రైతుబజార్లలో టమోటాలు విక్రయిస్తారన్నారు. రేషన్ కార్డు లేదా ఆధార్‌కార్డు తీసుకుని రావాలని, ఒకరికి రెండు కిలోలు మాత్రమే ఇస్తామన్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో సూపర్ క్రిటికల్ థర్మల్ ప్రాజెక్టులో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు ప్రాజెక్టు ఇంజినీర్లు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 450 మెగావాట్లు, 2వ యూనిట్లో 460 మెగావాట్లు, 3వ యూనిట్లో 600 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు వెల్లడించారు.

డీసీఎమ్మెస్‌లో 10 మంది ఉద్యోగుల తొలగింపు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్(డీసీఎమ్మెస్)లో విధులు నిర్వహిస్తున్న 10 మంది ఉద్యోగులను తొలగిస్తూ అధికారులు నోటీసులు జారీ చేశారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో డీసీఎమ్మెస్ కార్యాలయంలో మొత్తం 17 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 10 మంది ఉద్యోగులు 2020లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమితులయ్యారు. వీరిని 2023 నవంబర్‌లో రెగ్యులర్ చేసి మిగిలిన ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందజేశారు. అయితే గత మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదు. దీనిపై గత నెల 22న సాక్షిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత అధికారులు వేతనాలు ఇచ్చారు. అయితే సోమవారం డీసీఎమ్మెస్‌లో వ్యాపారం లేదని జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉండడంతో 10 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్టు నోటీసులు అందజేశారు. తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలు ఇచ్చి ఇప్పుడు తొలగిస్తున్నామని అధికారులు నోటీసులు ఇవ్వడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

దరఖాస్తు చేశారో ఖబడ్దార్!

మద్యం వ్యాపారులకు టీడీపీ సిండికేట్ల బెదిరింపులు

- నెల్లూరు నగరంలో బినామీలతో మంత్రి అనుచరుల దరఖాస్తులు
- నగర పరిధిలో దుకాణాలకు నారాయణ కోటరీ నేత కనుసన్నల్లోనే టెండర్లు
- సర్వేపల్లిలో షాపు వస్తే 20 శాతం వాటా ఇవ్వాల్సిందే
- అధికార పక్ష నేతలకు ఎక్సైజ్ అధికారుల దాసోహం

కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, మంత్రులు బరితెగిస్తున్నారు. అక్రమార్జనలో దేన్నీ వదలడం లేదు. తాజాగా ఎమ్మెల్యేల కనుసన్నల్లో తమ్ముళ్లు మద్యం దుకాణాలపై కన్నేశారు. టీడీపీ నేతలే సిండికేట్లుగా మారి దుకాణాలను స్వాధీనం చేసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. మమ్మల్ని కాదని ఎవరైనా దరఖాస్తు చేసుకున్నారో ఖబడ్దార్ అంటూ ఔత్సాహికులను బెదిరిస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నూతన మద్యం విధానంలో దరఖాస్తుల ద్వారా భారీగా ఆదాయం పొందాలని రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఎత్తుగడ పచ్చనేతల ధనార్జనతో బెడిసి కొడుతోంది. టీడీపీ నేతలు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు సిండికేట్‌గా మారుతున్నారు. వారికి ఎమ్మెల్యేలు, మంత్రులు వెనకుండి సహకారం అందిస్తుండడంతో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు వ్యాపారులు జంకుతున్నారు. టీడీపీ నేతలను కాదని లాటరీలో షాపులు దక్కించుకున్నా నిర్వహణ సాధ్యం కాదని భయపడుతున్నారు. దీంతో దరఖాస్తులు అనుకున్నట్లుగా రావడం లేదు. జిల్లాలో 182 మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు అక్టోబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటలు. మంగళవారం సాయంత్రానికి కేవలం 1,327 దరఖాస్తులు మాత్రమే నమోదయ్యాయి. ప్రభుత్వం ఒక్కో మద్యం షాపుకు సరాసరి 25 వరకు దరఖాస్తులు వస్తాయని అంచనా వేసుకుంది. తద్వారా ఫీజు రూపేణా రూ.91 కోట్ల వరకు ఆదాయం వస్తుందని భావించినా దానికి టీడీపీ నేతలే సిండికేట్లుగా మారి తూట్లు పొడుస్తున్నారు.

కందుకూరులో అదే సీన్

కందుకూరు నియోజకవర్గంలో కూడా స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే మద్యం దుకాణాల దరఖాస్తులు నమోదవుతున్నాయి. ఎమ్మెల్యే చుట్టూ ఉండే నేతలు కొందరు సిండికేట్‌గా మారారు. నియోజకవర్గంలో ఉన్న 17 మద్యం దుకాణాలను వారే దక్కించుకునేందుకు ఆ సిండికేట్ ద్వారానే దరఖాస్తులు చేస్తున్నారు. అధికార పార్టీ నేతలను కాదని దరఖాస్తులు చేస్తే తమ పరిస్థితి ఏమిటని ఔత్సాహికులు భయపడుతున్నారు.

సర్వేపల్లిలో వాటాలు

సర్వేపల్లి నియోజకవర్గంలో దరఖాస్తుదారులకు వింత అనుభవం ఎదురవుతోంది. ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని.. లాటరీలో షాపు వస్తే మాత్రం 20 శాతం వాటా ఇవ్వాలని షాడో ఎమ్మెల్యే నుంచి ఆదేశాలు వెళ్తున్నట్లు తెలుస్తోంది. షాపులో వాటాతో పాటు పర్మిట్‌రూం వద్ద ఏర్పాటు చేసే కూల్ డ్రింక్ షాపులు కూడా తామే ఏర్పాటు చేస్తామని హుకుం జారీ చేస్తున్నారు.

అధికారుల సహకారం

అధికార సిండికేట్లకు ఎక్సైజ్ శాఖ అధికారులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. దరఖాస్తులు తక్కువ పడుతుండడంతో వ్యాపారులతో మాట్లాడి వాటిసంఖ్య పెంచేలా చూడమని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కానీ ఎక్సైజ్ అధికారులు మాత్రం పాత వ్యాపారులకు ఫోన్‌లు చేసి దరఖాస్తులు చేసుకోమని చెపుతూనే.. వారు ఒకవేళ దరఖాస్తులు చేసి ఉంటే ఏ షాపుకు వేశారో వివరాలు తెలుసుకుని ఆప్రాంత టీడీపీ నేతలకు సమాచారం ఇస్తున్నారు. అధికారులకు వివరాలు చెప్పిన అర్ధగంటలోపే సిండికేట్ నేతలు ఫోన్‌లు చేసి మాకు తెలియకుండా దరఖాస్తులు ఎలా చేశావంటూ బెదిరిస్తున్నారు.

నగరంలో చక్రం తిప్పుతున్న అమాత్యుడు

ఎప్పుడూ వివాదాల్లో తలదూర్చని అమాత్యుడు ఏకంగా మద్యం షాపుల్లో మాత్రం చక్రం తిప్పడం విశేషం. మంత్రి అండదండలతో ఆయన కీలక అనుచరుడిగా ఇటీవల నామినేటెడ్ పదవి దక్కించుకున్న చోటా నేతతో పాటు మరో కీలక నేత బరితెగించి ఏకంగా మద్యం వ్యాపారులపై బెదిరింపులకు దిగినట్లు విమర్శలున్నాయి. నగర పరిధిలో ఉన్న 30 దుకాణాలు తమ బినామీలకే దక్కేలా ప్లాన్ వేశారు. దాదాపు వందకు పైగా దరఖాస్తులు మంత్రి స్వయంగా తన అనుచరులకు ఫీజులు చెల్లించి వారి చేత వేయించారు. అలాగే పాత మద్యం వ్యాపారులు ఎవరైనా తమను కాదని దరఖాస్తులు చేసుకున్నా నిర్వహణ చేయలేరని బెదిరించినట్లు తెలుస్తోంది.

దుకాణాలు ఏ ప్రాంతంలో ఎన్నంటే..

నెల్లూరు వన్ స్టేషన్‌లో 30, నెల్లూరు రూరల్ 3, కావలి మున్సిపాల్టీ 6, కావలి రూరల్ 4, బోగోలు 4, అల్లూరు నగర పంచాయితీ 4, అల్లూరు మండలం 2, దగదర్తి 2,
కోవూరు 6, కొడవలూరు 5, విడవలూరు 4, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ 6, బుచ్చిరెడ్డిపాళెం రూరల్ 3, ఇందుకూరుపేట 5, ఉదయగిరి 3, దుత్తలూరు 2, సీతారామపురం 2, వింజమూరు 3, కలిగిరి 3, వరికుంటపాడు 2, కొండాపురం 3,
జలదంకి 3, తోటపల్లి గూడూరు 5, ముత్తుకూరు 8, పొదలకూరు 6, వెంకటాచలం మండలం 6, మనుబోలు 3, ఆత్మకూరు మున్సిపాల్టీ 4, ఆత్మకూరు రూరల్ 2, ఎఎస్‌పేట 2, అనంతసాగరం 3, మర్రిపాడు 5, సంగం 3, చేజర్ల 3, కలువాయి 2,
రాపూరు 4, సైదాపురం 4, కందుకూరు మున్సిపాల్టీ 4, కందుకూరు రూరల్ 1, ఉలవపాడు 4, లింగసముద్రం 2, గుడ్లూరు 3, వలేటివారిపాళెంలో 3.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వివిధ పరిశ్రమలు, షాపులు, ఇటుక బట్టీలు తదితర చోట్ల పని చేసే బాలకార్మికులను గుర్తించాలన్నారు. ఎవరైనా బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే అందుకు సంబంధించిన యజమానులపై కఠిన చర్యలు చేపట్టి, భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. పరిశ్రమల్లో గుర్తించిన బాలకార్మికులను శిశుగృహాల్లో చేర్చాలని సూచించారు. బడిమానేసిన పిల్లల జాబితాను సిద్ధం చేసుకుని వారిపట్ల ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, డీఈఓ రామారావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ డీసీపీఓలు సమత, సుమతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కవితారెడ్డి, తిరుపతిరావు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఎమ్మెల్సీ బొత్స నేడు నెల్లూరు రాక




నెల్లూరు(అర్బన్): ఎమ్మెల్సీ, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ బుధవారం ఉదయం 8 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి రోడ్డు మార్గాన నెల్లూరు వస్తారు. ఇక్కడకు ఉదయం 11 గంటలకు చేరుకుని, ఇటీవల మృతిచెందిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ ఉత్తరక్రియల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ఇక్కడి నుంచి తిరుపతికి బయలుదేరి వెళ్తారు. అక్కడ నుంచి విమానంలో విశాఖపట్నం వెళ్తారు.

విద్యాశాఖపై రాజకీయ పెత్తనం

జిల్లా సైన్స్ అధికారి నియామకం వివాదాస్పదం

- ఎమ్మెల్యే సిఫార్సుతో మ్యాథ్స్ టీచర్ కరుణాకర్‌రెడ్డికి డిప్యుటేషన్
- సైన్స్ టీచరే ఉండాలంటూ మరో వర్గం వాదన
- అధికార పార్టీ నేతల చుట్టూ టీచర్ల ప్రదక్షిణలు
- వివాదం పరిష్కరించాలని డీఈఓకు కలెక్టర్ ఆదేశాలు
- సీనియర్ ఉపాధ్యాయులతో సమావేశం
- అయినా కొలిక్కిరాని సమస్య

జిల్లా విద్యాశాఖలో రాజకీయ నేతల పైరవీలు హెచ్చుమీరుతున్నాయి. విద్యాశాఖ, సమగ్రశిక్షల్లో ఉన్న ఖాళీ పోస్టుల్లో డిప్యుటేషన్‌పై వచ్చేందుకు పలువురు ఉపాధ్యాయులు ఆసక్తి చూపుతున్నారు. పోస్టింగ్ కోసం అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ విషయం ప్రస్తుతం ఆ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. రాజకీయ పెత్తనంపై పలువురు మండిపడుతున్నారు.



నెల్లూరు(టౌన్): రెండు నెలల క్రితం ఓ ఎమ్మెల్యే సిఫార్సుతో టీచర్ ఒకరు జిల్లా సైన్స్ సెంటర్‌కు అధికారిగా డిప్యుటేషన్‌పై పోస్టింగ్ తెచ్చుకున్నారు. దీనిని వ్యతిరేకిస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు సైన్స్ టీచరే ఆ సెంటర్‌కు అధికారిగా ఉండాలంటూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో సైన్స్ టీచర్ల సీనియార్టీ జాబితాను తనకు అందించాలని కలెక్టర్ కోరగా డీఈఓ సిద్ధం చేసి అందించారు. రెండు రోజుల క్రితం చెముడుగుంటలోని జిల్లా సైన్స్ కేంద్రంలో సీనియర్ సైన్స్ టీచర్లతో సమావేశం కూడా నిర్వహించారు. ఇందులో కలెక్టర్‌కు పలు విషయాలు వెల్లడయ్యాయి. రాజకీయ సిఫార్సులతో నగర, పట్టణ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇప్పించుకునేందుకు జిల్లా నుంచి 82 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఇవి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి.

ఏఏ కార్యక్రమాలు చేస్తారంటే..

జిల్లాలో 3.54 లక్షల మందికి పైగా ఉన్న విద్యార్థుల కోసం 2016లో వెంకటాచలం మండలంలోని చెముడుగుంటలో జిల్లా సైన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ అంశాలకు సంబంధించి 52 ఎగ్జిబిట్స్ ఉన్నాయి. పిల్లలు ఆడుకునేందుకు చిన్న పార్కును కూడా ఉంది. షార్‌కు సంబంధించి పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఆకాశ్‌కు సంబంధించి నమూనాలను పెట్టారు. ఇన్‌స్పైర్, సైన్స్ ఫెయిర్, జవహర్ లాల్ నెహ్రూ మ్యాథ్స్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్‌డే, కౌశల్, నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్, సేవ్ గరల్స్ చైల్డ్ లాంటి కార్యక్రమాలు జిల్లా సైన్స్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. 32 అటల్ టింకరింగ్ ల్యాబ్స్, 80 వరకు స్టెమ్ ల్యాబ్స్‌ను ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. వీటిని కూడా సైన్స్ అధికారే పర్యవేక్షిస్తుంటారు.


జిల్లా సైన్స్ సెంటర్

సైన్స్ టీచర్లతో సమావేశం

కలెక్టర్ ఆదేశాలతో సైన్స్ కేంద్రంలో మూడు రోజుల క్రితం సీనియర్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులతో డీఈఓ రామారావు సమావేశం నిర్వహించారు. సైన్స్ అధికారిగా పనిచేసేందుకు సీనియార్టీ ప్రకారం సంబంధిత టీచర్ల అభిప్రాయాలను తెలుసుకున్నారు. దీనికి ఎవరూ ముందుకు రాలేదని తెలిసింది. అయితే తెరవెనుక మాత్రం అధికార పార్టీ నేతల సిఫార్సులతో సైన్స్ అధికారిగా డిప్యుటేషన్‌పై వచ్చేందుకు అనేకమంది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. సమావేశంలో బయటపడితే ఎక్కడ టార్గెట్ అవుతామో అని భయపడుతున్నట్లు చెబుతున్నారు. జిల్లా సైన్స్ అధికారిగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుడినే ఉంచుతారా లేక మరో వ్యక్తిని నియమిస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది.

ఎమ్మెల్యే సిఫార్సుతో..

ప్రస్తుతం జిల్లా సైన్స్ అధికారిగా కరుణాకర్ రెడ్డిని నియమించారు. ఈయన రాపూరు మండలంలోని పాఠశాలలో పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సిఫార్సుతో వచ్చినట్లు తెలిసింది. ఈ విద్యా సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై వరకు గాయత్రి అనే ఉపాధ్యాయురాలు సైన్స్ అధికారిగా పని చేశారు. ఏమైందో తెలియదు గానీ నాలుగు నెలలకే ఆ పోస్టింగ్ వద్దంటూ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోవడంతో ఈమె స్థానంలో మ్యాథ్స్ టీచర్ అయిన కరుణాకర్‌రెడ్డిని నియమించారు. దీనిపై కొంతమంది సైన్స్ టీచర్లు అభ్యంతరం చెబుతున్నారు. సైన్స్ ఉపాధ్యాయులను మాత్రమే నియమించాలని వాదిస్తున్నారు. అలాంటి నియమం లేదని మరో వర్గం వాదిస్తోంది.

ఎవరూ ముందుకు రాలేదు

జిల్లా సైన్స్ అధికారిగా పనిచేసేందుకు సీనియార్టీ ఉన్న 15 మంది ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులను పిలిచి అడిగాం. ఎవరూ ముందుకు రాలేదు. జిల్లా సైన్స్ కేంద్రాన్ని అభివృద్ధి చేసే దిశగా ఆలోచిస్తున్నాం. ఫలానా టీచరునే అధికారిగా నియమించాలన్న జీఓ ఎక్కడా లేదు. ఆసక్తి ఉన్న వారు పనిచేసినప్పుడే అనుకున్న ఫలితాలు సాధిస్తాం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైన్స్ కేంద్రాన్ని విజిట్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు సంబంధించి బస్సులను కూడా ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నాం. – పీవీజే రామారావు, డీఈఓ

లాభాలు ఒడిసి 'పట్టు'

పట్టు పరిశ్రమపై రైతులు అవగాహన పెంపొందించుకుంటే లాభాలు గడించే అవకాశం ఉంది. జిల్లాలో సాగవుతున్న అన్ని రకాల పంటలతో పోల్చి చూస్తే మల్బరీ విస్తీర్ణం చాలా తక్కువ. దీని సాగును పెంపొందించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పట్టు పురుగుల పెంపకం శ్రమతో కూడుకున్నదనే అపోహతో రైతులు ముందుకు రావడం లేదు. కొందరు మాత్రం దీనిని వరంగా మార్చుకుని లాభాలు ఆర్జిస్తున్నారు.

- వ్యవసాయ కుటీర పరిశ్రమగా పేరు
- అధికారుల ప్రోత్సాహకాలు
- పట్టు పురుగుల మేతకు మల్బరీ మొక్కల పెంపకం
- జిల్లాలో చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు
- సిబ్బంది కొరతతో కొంత ఇబ్బందులు


పట్టు పురుగులు


మల్బరీ తోట వద్ద రైతు వెంకటరమణారెడ్డి

పొదలకూరు: జిల్లాలో ప్రస్తుతం 12 మండలాల్లో పట్టు పరిశ్రమ ఉంది. ఇది వ్యవసాయ ఆధారిత కుటీర పరిశ్రమ. దీనిని ఇంటి చుట్టుపక్కల కూడా ఏర్పాటు చేసుకుని నెలనెలా లాభాలు ఆర్జించేందుకు అవకాశం ఉంది. రైతుల్లో నెలకొన్న అపోహలు పోగొట్టి ఆసక్తి పెంచితే పంటల మార్పిడితో పాటు ఆదాయాన్ని పొందేందుకు వీలు కలుగుతుంది. గత ప్రభుత్వం పట్టు పరిశ్రమకు ప్రోత్సాహాలను బాగా అందజేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది నియామకం చేపట్టింది. ప్రస్తుతం ఫీల్డ్ ఆఫీసర్లు తగినంత మంది లేకపోవడంతో రాయితీల వివరాలు రైతులకు తెలియడం లేదు. పట్టు పరిశ్రమ చిన్న, సన్నకారు రైతులకు కల్పవృక్షం, కుటుంబమంతా పాలుపంచుకునే కుటీర పరిశ్రమ. ఎకరానికి రైతుకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల ఆదాయం వస్తుంది.

చాలా తక్కువ

జిల్లాలోలోని మర్రిపాడులో చాలాకాలంగా పట్టు పరిశ్రమపై రైతులకు అవగాహన ఉంది. సంగం, పొదలకూరు, బుచ్చిరెడ్డిపాళెం, వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, ఆత్మకూరు, చేజర్ల, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లో 280 ఎకరాల్లో 80 మంది రైతులు సాగు చేస్తున్నారు. పొదలకూరు మండలం సూరాయపాళెంలో ఇటీవల వెంకటరమణారెడ్డి అనే రైతు వీ–1 రకం పట్టు పురుగు గుడ్లను తీసుకొచ్చారు. రెండెకరాల మల్బరీ తోట కలిగిన రైతు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుంది.

సిబ్బంది కొరత

గత ప్రభుత్వ హయాంలో జిల్లా పట్టు పరిశ్రమ శాఖలో 70 సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య ఐదుకు చేరుకున్నట్టు తెలుస్తోంది. దీంతో పట్టు సాగుపై రైతులకు ఆసక్తి ఉన్నా విస్తరణకు పెంపొందించేందుకు అవకాశం లేకుండా ఉంది. ప్రధానంగా ఫీల్డ్ ఆఫీసర్ల సంఖ్య పెంచితే విస్తీర్ణం పెరుగుతుంది. ఇప్పుడు మూడు, నాలుగు మండలాలకు కలిపి ఒక ఫీల్డ్ ఆఫీసర్ ఉన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పర్యటించి రైతులను ప్రోత్సహించలేకపోతున్నారు.

రాయితీలిలా..

పట్టు పరిశ్రమ శాఖ ద్వారా అధికారులు రాయితీలను అందజేస్తున్నారు. మల్బరీ నూతన సాగు కోసం ఎకరాకు యూనిట్ ధర రూ.30 వేలు అవుతుండగా ఇందులో జనరల్ కేటగిరీకి రూ.22,500 (75 శాతం), ఎస్సీ, ఎస్టీలకు రూ.27,000 (90 శాతం) రాయితీలను ఇస్తున్నారు. పట్టు పురుగుల గది నిర్మాణం కోసం యూనిట్ ధర 50x20 (టైప్–1) 1,000 చదరపు అడుగులు రూ.4.50 లక్షలు. ఇందులో జనరల్ వారికి రూ.3,37,500 (75 శాతం), ఎస్సీ, ఎస్టీలకు రూ.4,05,000 (90 శాతం), పురుగుల పెంపకం టైప్–1 యూనిట్ ధర రూ.75 వేలు. ఇందులో జనరల్ వారికి రూ.56,150 (75 శాతం), ఎస్సీ, ఎస్టీలకు రూ.67,500 (90 శాతం), పురుగుల పెంపకం టైప్–2 యూనిట్ రూ.50 వేలు. ఇందులో జనరల్ వారికి రూ.3,750 (75 శాతం), ఎస్సీ, ఎస్టీలకు రూ.4,500 (90 శాతం), క్రిమి సంహారక మందుల రాయితీ యూనిట్ పర్ షెడ్ రూ.5 వేలు కాగా ఇందులో జనరల్‌కు రూ.3,750 (75 శాతం), ఎస్సీ, ఎస్టీలకు రూ.4,500 (90 శాతం), చాకి చార్జీల రాయితీ 100 డీఎఫ్ఎల్ యూనిట్ రూ.2 వేలు కాగా జనరల్‌కు రూ.1,000 (50 శాతం), ఎస్సీ, ఎస్టీలకు రూ.1,800 (90 శాతం), విక్రయ కేంద్రాల్లో హైబ్రీడ్ పట్టుగూళ్లకు కిలోకు 50 శాతం రాయితీ వంతున ఎన్ని కిలోలకైనా అందజేయడం జరుగుతుంది.

జిల్లాలో..

ఎన్ని మండలాల్లో..	12
ఎన్ని ఎకరాలు	238
రైతుల సంఖ్య	80

లాభదాయకం

పట్టు పరిశ్రమ సాగు లాభదాయకంగానే ఉంది. నేను రెండెకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నాను. మంచి గుడ్లను తీసుకొచ్చి జాగ్రత్తలు తీసుకుంటే నెలవారీ లాభాలను ఆర్జించేందుకు వీలుంటుంది. పలమనేరు ప్రభుత్వ యార్డులో రైతులు తీసుకెళ్లే పట్టుకు వేలం నిర్వహిస్తారు. బెంగళూరుకు కూడా పట్టును తరలించి అమ్ముకోవచ్చు.

– డి.వెంకటరమణారెడ్డి, రైతు, సూరాయపాళెం


పురుగుల పెంపకానికి ఉపయోగించే మంచాలు


నాణ్యమైన పట్టు

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తరణ పెరిగేందుకు కృషి చేస్తున్నాం. రాయితీల గురించి రైతులకు ఎప్పటికప్పుడు అందజేయడం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి పట్టుసాగుపై ఆసక్తిని పెంచుతున్నాం. మరో వంద ఎకరాల్లో విస్తీర్ణం పెంపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫీల్డ్ ఆఫీసర్ల కొరత వల్ల అన్ని మండలాలను పర్యటించలేకపోతున్నాం.

– ఎస్.సత్యనారాయణ, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి, నెల్లూరు

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 350 మంది మృతి
- కలెక్టర్ ఆనంద్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మంగళవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 350 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందడం బాధాకరమన్నారు. ప్రాణ నష్టం జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. దీనిపై హైవే ప్రవేశ, నిష్క్రమణ పాయింట్ల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. హైవేపై సెంట్రల్ లైటింగ్ సక్రమంగా పని చేసేలా, సిగ్నల్స్ వద్ద తగిన గుర్తులు ఉండేలా, ప్రధాన కూడళ్ల వద్ద బోర్డులు, బ్యానర్లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెల్లూరు – తడ వరకు నిర్మిస్తున్న ఆరు లేన్ల జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సర్వీసు రోడ్లను కూడా ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. హైవేపై ఎంపిక చేసిన ప్రదేశాల్లో 5 నుంచి 10 ఎకరాల్లో పెట్రోలు బంకు, డ్రైవర్ల విశ్రాంత గదులు, హోటళ్లు, పార్కింగ్ మొదలగు సౌకర్యాలు ఒకేచోట ఉండేలా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. గత సమావేశాల్లో ఎంపిక చేసిన ప్రదేశాల్లో త్వరగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిర్వహణా చర్యలు చేపట్టాలని పోలీసు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాల్లో క్షతగాత్రులను కాపాడిన వారికి అవార్డులు అందించాలని, ఆగస్టు 15, జనవరి 26 తేదీల్లో వారిని సత్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డీటీసీ చందర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు చందన, సుధాకర్ రెడ్డి, నాగలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ అధికారులు విద్యాసాగర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, కమిటీ సభ్యులు శేఖర్‌రెడ్డి, సతీష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'మీ తల్లిదండ్రులంటే ఇష్టం లేదు'

- భర్తకు లేఖ రాసి భార్య అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటనపై నెల్లూరు సంతపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. సంతపేటకు చెందిన శరత్‌బాబు సంవత్సరం క్రితం ఓ ఫంక్షన్ నిమిత్తం విజయవాడకు వెళ్లాడు. అక్కడ ఆయనకు అఖిల మాధురితో పరిచయమైంది. అది కాస్తా ప్రేమకు దారి తీసింది. ఇద్దరు వివాహం చేసుకుని సంతపేటలో కాపురం ఉంటున్నారు. ఈనెల ఐదో తేదీన శరత్‌బాబు విజయవాడకు వెళ్లాడు. మీ తల్లిదండ్రులంటే ఇష్టం లేదని అందుకే వెళ్లిపోతున్నానని భర్తకు లేఖ రాసి అఖిల మాధురి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మరుసటిరోజు ఈ విషయం తెలుసుకున్న శరత్‌బాబు వెంటనే నెల్లూరుకు చేరుకుని భార్య కోసం గాలింపు చర్యలు చేపట్టాడు. జాడ తెలియకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ నెల్లూరు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. రామకోటయ్యనగర్‌కు చెందిన షేక్ సుమియాకు వెంగళరావ్ నగర్‌కు చెందిన నూర్‌తో పదినెలల క్రితం వివాహమైంది. ఆ సమయంలో ఆమె కుటుంబసభ్యులు కట్నకానుకల కింద రూ.20 వేల నగదు, ఐదు సవర్ల బంగారు ఆభరణాలు, గృహోపకరణాలు నూర్‌కు ఇచ్చారు. కొద్దిరోజులు వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం భర్త, అత్తింటివారు సుమియాను అదనపుకట్నం కోసం వేధించసాగారు. ఆమెను కొట్టడంతో వేధింపులు తాళలేక తన పుట్టింటికి వెళ్లింది. కొద్దిరోజుల అనంతరం ఆమె భర్త వద్దకు వెళ్లింది. అయితే నూర్, అత్తమామల్లో మార్పు రాకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బంగారు చైన్ అందజేత


మహిళకు చైన్‌ను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళ గుడిలోకి వెళ్లే క్రమంలో పోగొట్టుకున్న బంగారు చైన్‌ను నెల్లూరు చిన్నబజారు పోలీసులు వెతికి అందజేశారు. వివరాలు.. విశాఖపట్నం శీలానగర్‌లో ఉష, నారాయణ దంపతులు నివాసం ఉంటున్నారు. ఉష తన పిల్లలతో రెండురోజుల క్రితం మూలాపేటలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఈనెల ఏడో తేదీ రాత్రి ఆమె ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి వెళ్లే క్రమంలో మెడలోని బంగారు చైన్ తెగి కింద పడిపోయింది. ఈ విషయాన్ని గమనించకుండా దర్శనానికి వెళ్లిపోయింది. కాసేపటికి చైన్ లేదని చూసుకుని గుడిలో, బయట వెతికింది. కనిపించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు విషయాన్ని తెలియజేసింది. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు పర్యవేక్షణలో క్రైమ్ పార్టీ సిబ్బంది సాంకేతికత ఆధారంగా పోగొట్టుకున్న చైన్‌ను గుర్తించారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ తన కార్యాలయంలో దానిని ఉషకు అందజేశారు. ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.57.73 కోట్లతో పనులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించిన కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే పల్లె పండగ పంచాయతీరాజ్ వారోత్సవాల్లో రూ.57.73 కోట్లతో 1,900 పనులు చేపట్టడానికి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఆనంద్ వివరించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్ నుంచి ఆనంద్, ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పనులను జనవరి నాటికి పూర్తి చేయనున్నామని తెలిపారు. ఇనుము, ఇసుక కొరత లేదని వివరించారు. ప్రధానంగా చెక్‌డ్యాంలు, నీటికుంటలు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పంటకాలువ పనులను ఉపాధిహామీ నిధులతో చేయబోతున్నామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవానీ, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ అశోక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వెంకటరమణ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక, మట్టి అక్రమ రవాణా

- జిల్లాలో వివిధ చోట్ల ట్రాక్టర్ల స్వాధీనం
- రేవూరులో అధికార పార్టీ నేత ఒత్తిడి


వెంకటాచలం: పోలీస్‌స్టేషన్ వద్ద ఇసుక ట్రాక్టర్లు

సోమశిల: తెలుగుదేశం నాయకులు ఇసుక, మట్టి అక్రమ రవాణాను సాగిస్తూనే ఉన్నారు. కఠిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా అదంతా ఒట్టిదేనని తేలిపోయింది. అనంతసాగరం మండల పరిధిలోని రేవూరు గ్రామంలో మంగళవారం తహసీల్దార్ వీరవసంతరావు నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న వాహనాలపై దాడులు చేశారు. ఈ సమయంలో ఒక ట్రాక్టర్ మట్టి దించి వస్తుండగా, మరొకటి మట్టి తరలిస్తుండగా పట్టుకున్నారు. అయితే అధికార పార్టీకి చెందిన ఓ నేత ఒత్తిడితో మట్టి ట్రాక్టర్‌ను వదిలేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఖాళీ దానిని స్టేషన్‌కు తరలించారు.

బిల్లులు లేకపోవడంతో..

వెంకటాచలం: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను వెంకటాచలం పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను గుర్తించారు. ఎలాంటి బిల్లులు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఇసుక అక్రమరవాణాపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం పొట్టెపాళెనికి చెందిన రాజేంద్ర, రాజేష్‌లు అన్నదమ్ములు. వీరు మంగళవారం తెల్లవారుజామున తమ ట్రాక్టర్‌లో తిరుపతి జిల్లా కోట మండలం విద్యానగర్ ప్రాంతంలోని స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా అయ్యప్పగుడి వద్ద వేదాయపాళెం పోలీసులు పట్టుకున్నారు.

26 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): టెట్‌కు మంగళవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 26 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 110 మందికి గానూ 97 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 110 మందికి గానూ 97 మంది హాజరయ్యారు.

పొట్టేళ్ల వేలం నేడు


నెల్లూరు(సెంట్రల్): కొండాపురం మండలం చింతలదేవి పశుగణాభివృద్ధి క్షేత్రంలో బుధవారం 177 పొట్టేళ్లను వేలం వేయడం జరుగుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జోడిపి పొట్టేళ్లు 170, నెల్లూరు పల్లా పొట్టేళ్లు ఏడు వేలం వేయడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు ముందుగా రూ.5 వేలు చెల్లించాలన్నారు.

సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలను త్వరలోనే నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలు నుంచి మంగళవారం ఆయన అధికారులతో కలిసి అన్ని మండలాల్లోని ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పక్కాగా ఓటర్ల జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. మన బడి – మన భవిష్యత్, రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, ఉపాధి హామీ పనిదినాల పెంపు, హౌసింగ్ తదితర అంశాలపై మాట్లాడారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో లవన్న, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఈఓ రామారావు, సమగ్ర శిక్ష ఏపీఓ ఉషారాణి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.80
సన్నవి	రూ.40
పండ్లు	రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	134
లేయర్ (లైవ్)	110
బ్రాయిలర్ చికెన్	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	264
లేయర్ చికెన్	187